





అమ్మవారి దర్శనం, అక్షరాభ్యాసం పూజల కోసం క్యూలైన్లలో వేచి చూస్తున్న భక్తులు



గోడం నగేష్, ఎంపీ

కొత్త ఎంపీపై.. కోటి ఆశలు

- సవాల్ కానున్న జిల్లాలోని సమస్యలు
- ఆర్మూర్-నిర్మల్ రైల్వే లైన్, ఫారెస్ట్ క్లియరెన్స్ నిధుల మంజూరే కీలకం
- అమలుకు నోచుకోని కేంద్ర ప్రభుత్వ నిధుల ప్రకటన
- ఆందోళనలు చేపడుతున్న రైల్వే లైన్ సాధన సమితి
- జిల్లావ్యాప్తంగా మారుమూల గ్రామాలకు కరువైన రోడ్డు సౌకర్యం

నిర్మల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన గోడం నగేష్‌పై పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు పలు స్కీములకు భారీగా నిధులు మంజూరు చేయించడమే ఎంపీపై ఉన్న ప్రధాన బాధ్యతగా చెబుతున్నారు. ఎంపీగా ఎన్నికైన నగేష్ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీకి చెందిన వారు కావడంతో ఆయనపై ఈసారి ఆశలు రెట్టింపవుతున్నాయి. అయితే ఏళ్ల నుంచి జిల్లాలో పేరుకుపోయిన సమస్యలకు కొత్తగా ఎన్నికైన ఎంపీ నగేష్ పరిష్కార మార్గం చూపాలంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సాధారణంగా అమలయ్యే సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు కొత్త పథకాలను జిల్లాకు రప్పించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ఇక్కడి ప్రజలకు ఏళ్ల నుంచి కలగా మిగిలిపోయిన ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వే లైన్ నిర్మాణ పనులను మంజూరు చేయించాలని కోరుతున్నారు. గతంలో కూడా అప్పటి ఎంపీ సోయం బాపురావు ఈ రైల్వే లైన్ కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ.. ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఎప్పటికప్పుడు సమస్య తీవ్రతను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత రైల్వే శాఖ మంత్రితో పకడ్బందీ సంప్రదింపులు జరిపితేనే ఈ రైల్వేలైన్‌కు మోక్షం లభిస్తుందంటున్నారు. నిర్మల్, ఆదిలాబాద్ ప్రాంతాలలో రైల్వే లైన్ సాధన సమితి కూడా ఏర్పడి ఆందోళనలు చేపడుతున్నాయి. ఈ రైల్వేలైన్ పూర్తయితే హైదరాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రవాణా రంగంలో ఎంతో అభివృద్ధి చెందుతుంది. గతంలో దీని సర్వే కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. ఆ ప్రకటన ఆచరణకు నోచుకోలేదు. కాగా ప్రస్తుతం ఎంపీగా ఎన్నికైన నగేష్‌పై రైల్వే లైన్ సాధన బాధ్యత అత్యంత కీలకం కానున్నది. రైల్వే లైన్ కోసం మొదట అవసరమయ్యే సర్వే పనులకు నిధులు మంజూరు చేయిస్తే.. దీనికి సంబంధించి ఓ అడుగు ముందుకు పడినట్లేనంటున్నారు. ఒకవేళ రైల్వే లైన్ విషయంలో నిర్లక్ష్యం కొనసాగితే నిర్మల్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎంపీని ప్రశ్నించే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్నారు.

ఫారెస్ట్ క్లీయరెన్స్‌లు కీలకం

ముఖ్యంగా నిర్మల్ జిల్లాలోని కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ అలాగే మంచిర్యాల జిల్లాలోని జన్నారం, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ప్రాంతాలన్నీ రిజర్వ్ ఫారెస్ట్‌తో పాటు కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఉన్నాయి. అయితే ఇక్కడి మారుమూల గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, కరెంట్ లైన్లు, స్తంభాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్లు, కాలువల నిర్మాణాల వంటి పనులన్నింటినీ చేపట్టాలంటే సెంట్రల్ ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్మెంటల్ డిపార్ట్మెంట్ అనుమతులు తప్పనిసరి. చాలా ఏళ్ల నుంచి సెంట్రల్ ఫారెస్ట్ ఎన్విరాన్మెంటల్ డిపార్ట్మెంట్ నుంచి అనుమతులు రాకపోతుండడంతో.. ఇక్కడి చాలా మారుమూల గ్రామాలు రోడ్డు సౌకర్యానికి అలాగే కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఇక్కడి ఆదివాసీలంతా తమ సమస్యను సత్వరమే పరిష్కరించాలంటూ ఇప్పటికే ఆందోళన సైతం చేపట్టారు.

ఇతర స్కీంలపైనా దృష్టి సారించాలి

నిర్మల్, ఆదిలాబాద్ లాంటి పట్టణాలలో అండర్ డ్రైనేజీ నిర్మాణాల కోసం కేంద్ర నిధులను రాబట్టాల్సిన అవసరం ఉందంటున్నారు. అలాగే ట్రైకార్, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో పాటు సెంట్రల్ సెక్టార్స్ స్కీములో భాగమైన ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకానికి సంబంధించి జిల్లాకు భారీగా యూనిట్లను మంజూరు చేయించాల్సిన బాధ్యత ఎంపీపై ఉందంటున్నారు. అలాగే కేంద్రం ద్వారా మౌలిక సౌకర్యాల కల్పన కోసం మంజూరయ్యే నిధులను కూడా ఎక్కువగా జిల్లాకు కేటాయింపజేయాలని స్థానికులు సూచిస్తున్నారు.

గతం పునరావృతం కావద్దు



మొన్నటి వరకు కూడా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడం, అదే పార్టీకి చెందిన ఎంపీ పార్లమెంట్ నియోజకవర్గానికి నేతృత్వం వహించినప్పటికీ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వే లైన్ నిర్మాణం, అటవీ, పర్యావరణ శాఖ అనుమతుల సాధన, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలు లాంటి సమస్యలు పరిష్కారం కాలేదన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కొత్త ఎంపీ పెద్దఎత్తున కృషి చేయాల్సిన అవసరముందంటూ స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు (ఫైల్)

బాసరకు భారీగా భక్తుల తాకిడి

- వేసవి సెలవులు దగ్గరపడడంతో తరలివస్తున్న భక్తులు
- నిత్యం వందలాది మంది చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు

బాసర, జూన్, 8: బాసర సరస్వతి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వేసవి సెలవులు చివరి రోజులు కోవడంతో ప్రతిరోజు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరవుతున్నారు. శనివారం అమ్మవారి నిలయం భక్తులతో పోటెత్తింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. నదిలో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. మరోపక్క రెండు మండపాల్లో భక్తులు తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు జరిపించేందుకు క్యూకట్టారు. దర్శనాలు, పూజల కోసం భక్తులు రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. మరో వారం రోజులు పాటు ఇలాగే రద్దీ కొనసాగవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో విజయ రామారావు పర్యవేక్షిస్తున్నారు.



పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

లోకేశ్వరం పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

లోకేశ్వరం, జూన్ 8: లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌ను శనివారం ఎస్పీ జానకీ షర్మిల సందర్శించారు. బాసర వెళ్తున్న క్రమంలో ఆమె లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ విశాలంగా ఉందని, విస్తృతంగా మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లా దకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఇందులో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

10న ధ్రువీకరణ : డీఈవో

నిర్మల్ కల్చరల్, జూన్ 8 : ఈ నెల 10న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు సర్టిఫికెట్ల ధ్రువీకరణకు హాజరుకావాలని డీఈవో రవీందర్ రెడ్డి కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతిలో భాగంగా సెయింట్ థామస్ స్కూల్‌లో ఉదయం 9 గంటలకు మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారు తప్పనిసరి అన్నారు. సర్వీస్ బుక్, విద్యార్హత, తదితర ఒరిజినల్స్‌తో పాటు జీరాక్స్ కాపీలతో ధ్రువీకరణకు హాజరుకావాలన్నారు.

'నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలి'

నిర్మల్ కల్చరల్, జూన్ 8: నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. శనివారం జిల్లా కార్యదర్శి దిగంబర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 67 మందికి 720 మందికి 720 మార్కులతో ఆల్ ఇండియా మొదటి ర్యాంకు రావడంతో పరీక్షా పత్రాలు లీకైనట్లు అనుమానాలు చోటుచేసుకున్నాయన్నారు. ఒకే కేంద్రం నుంచి ఆరుగురు ఉన్నారని పేర్కొన్నారు. ఎన్టీఏ పరీక్షను రద్దు చేయాలని కోరారు.

నేడు ఎస్సీ కాలనీలో సమావేశం

నిర్మల్ కల్చరల్, జూన్ 8: పట్టణంలోని బుధవార్‌పేట్ ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ భవనంలో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే రాష్ట్ర యువజన సంఘ సర్వసభ్య సమావేశం జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.వెంకటస్వామి ఒక ప్రకటనలో కోరారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి పదాధికారుల నియామక ప్రక్రియ కోసం అభిప్రాయం సేకరిస్తామన్నారు. సకాలంలో పదాధికారులు, కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

చేప మందు పంపిణీ

సారంగాపూర్, జూన్ 8: మండలంలోని బీరవెల్లిలో మృగశిర కార్తెను పురస్కరించుకొని శనివారం సంగం కృష్ణ లింగం సోదరులు చేప మందును పంపిణీ చేశారు. ప్రతి ఏడాది మృగశిర కార్తె రోజున ఈ చేప మందును ఆయుర్వేద ఔషధాన్ని చేప పిల్లలతో కలిపి తయారు చేసిన చేప మందును పంపిణీ చేస్తారు. దగ్గు, దమ్ము, ఉబ్బసం వంటి వ్యాధులు ఉన్నటువంటి వ్యాధిగ్రస్తులు ఈ చేప మందు ప్రసాదాన్ని తినడానికి అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సాయి ఆలయంలో అన్నదానం

నిర్మల్ అర్బన్, జూన్ 8: పట్టణంలోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. శనివారం జరిగిన అన్నదానంలో మేఘన-కౌశిక్‌రెడ్డి దంపతులు అన్నదాతగా నిలిచారు. వీరు ప్రతీనెల 8న అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చినట్లు సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా భక్తుల కోసం నిత్యాన్నదానాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నిత్యాన్నదానంలో సాయి భక్తులు పాలుపంచుకొని అన్నదాతలుగా నిలిచి సాయి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఇష్టారాజ్యంగా విత్తన విక్రయాలు!

- అధిక ధరలకు పత్తి విత్తనాల విక్రయాలు
- ధరాఘాతానికి గురవుతున్న అన్నదాతలు
- 'మామూళ్లు'గానే అధికారుల తనిఖీలు

భైంసా, జూన్ 8: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా మార్కెట్‌లో అధిక ధరలకు పత్తి విత్తనాల విక్రయాలు జరుగుతున్నాయి. నాలుగు కంపెనీలకు చెందిన విత్తనాలకు అధికంగా డిమాండ్ ఉండటంతో విక్రయదారులు వాటి ధరను ఇష్టారాజ్యంగా పెంచుతూ విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఒక్కో పత్తి విత్తన పాకెట్ రూ.864లకు విక్రయించాల్సి ఉంది. అయితే ఇక్కడి మార్కెట్ పరిధిలో నూజివీడు కంపెనీకు చెందిన ఆధ్య, తులసి కంపెనీకు చెందిన కబడ్డీ, అగ్రీసీడ్స్‌కు చెందిన యూఎస్ 7067, రాశి కంపెనీకు చెందిన ఆర్‌సీహెచ్659 పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సంబంధిత పత్తి విత్తనాల పాకెట్లు రూ.1350 నుంచి రూ.1600 ధరలతో అమ్మకాలు చేపడుతున్నారు. విత్తన ధరాఘాతాలతో ఇక్కడి మార్కెట్‌లో రైతులు కష్టనష్టాలపాలవ్వుతున్నారు. ధరలను నియంత్రించాల్సిన వ్యవసాయాధికారులు మిన్నకుండిపోవడం అనుమానాలకు తావీస్తోంది.

● జిల్లా వ్యవసాయాధికారి ఒంటరిగా తనిఖీలు

ఇక్కడి మార్కెట్ పరిధిలో జిల్లా వ్యవసాయాధికారి అంజీప్రసాద్ చేపడుతున్న తనిఖీలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. విత్తన విక్రయాల్లో రైతులకు న్యాయం చేయాల్సిన సదరు అధికారి అన్యాయం విధానాలను అవలంభిస్తున్నాడనే ఆరోపణలు వినవస్తున్నాయి. సంబంధిత శాఖకు చెందిన ఒక్క అధికారి తోడు లేకుండా జిల్లా వ్యవసాయాధికారి ఒంటరిగా వచ్చి తనిఖీలు చేపట్టడం ఇందుకు ఉతమిస్తోంది. సాధారణంగా ఏ శాఖకు చెందిన అధికారి తనిఖీలకు వెళ్లిన సంబంధిత శాఖకు చెందిన అధికారులు లేదా సిబ్బంది వెంట ఉంటారు. కాని జిల్లా వ్యవసాయాధికారి మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి ఇక్కడి మార్కెట్‌కు ఒక్కడే నేరుగా వచ్చి విక్రయ కేంద్రాల్లో 'మామూలు' తనిఖీలు చేపడుతున్నారు. విక్రయదారులతో జిల్లా వ్యవసాయాధికారి అంజీప్రసాద్ లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకోవడం మూలంగానే అధిక ధరలకు విత్తనాల విక్రయాలు జరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

> **ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పత్తి విత్తనాల విక్రయాలు**
>
> **: అంజీప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి, నిర్మల్**
>
> అధిక ధరలు, మాములు తనిఖీలపై జిల్లా వ్యవసాయ అధికారి అంజీప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మాట్లాడారు. భైంసా పట్టణ పరిధిలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పత్తి విత్తనాల విక్రయాలు జరుగుతున్నాయి. అధిక ధరలకు ఎంత మాత్రం అమ్మకాలు జరగడం లేదు. పారదర్శకమైన పద్ధతిలో తనిఖీలు చేపడుతున్నాం. ఒకే మారు ఒంటరిగా తనిఖీలు చేపట్టాను. ఎలాంటి లోపాయికారి విధానాలు అవలంబించ లేదు.



● బహిరంగంగా అధిక ధరలకు విక్రయాలు

ఇక్కడి మార్కెట్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం రోజు విడిచి రోజు తనిఖీలు చేపడుతోంది. నకిలీ విత్తనాల కట్టడి, అధిక ధరల నియంత్రణ పేరిట తనిఖీలు జోరుగా కొనసాగుతున్నాయి. అయితే బహిరంగంగా అధిక ధరలకు ్రావిత్తనాల విక్రయాలు జరుగుతున్నప్పటికి తనిఖీలు చేపడుతున్న టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించకపోవడం గమనార్హం. అంతేకాకుండా విత్తన విక్రయ కేంద్రాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపడుతున్న సమయాల్లోనూ అధిక ధరలకు విత్తనాల విక్రయాలు కొనసాగుతుండటం విశేషం.

● బిల్లులో ప్రభుత్వం నిర్ణయించిన ధరలే..

అధిక ధరలకు పత్తి విత్తనాలను అమ్ముత్తున్న విక్రయదారులు బిల్లులు రాసేటపుడు మాత్రం జాగ్రత్త చర్యలు పాటిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను మాత్రమే బిల్లులో నమోదు చేస్తున్నారు. అధికంగా విధించిన ధరలను మాత్రం చిన్నపాటి తెల్లటి కాగితంపై రాసి జీరో బిల్లు రూపంలో రాసిస్తున్నారు. కొంత మంది విక్రయదారులు ప్రభుత్వ ధరలనుబిల్లు ముందరి భాగంలో రాసి అధికంగా విధించిన ధరలను వెనుకవైపు భాగంలో రాసి మొత్తం వసూలు చేస్తున్నారు



ఒంటరిగా తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అంజీప్రసాద్ (ఫైల్)



మార్కెట్లో డిమాండ్‌తో విక్రయిస్తున్న పత్తి విత్తనాలు

ఓటమితో కృంగిపోను.. ప్రజలకు అండగా పనిచేస్తా

● కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ

నిర్మల్ కల్చరల్, జూన్ 8: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని, ఓటమికి కృంగిపోనని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అభ్యర్థి ఆత్రం సుగుణ స్పష్టం చేశారు. శనివారం ఆమె నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావుతో కలిసి ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తన గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. తాను ఎప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు నాయకులమంతా కలిసికట్టుగా పని చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని పటిష్ఠం చేసి కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాజిద్ అహ్మద్, ఎంబడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుగుణ

● బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్: మండలంలోని దుర్గానగర్ తండాలో శుక్రవారం పిడుగుపాటుకు గురై మృతి చెందిన బాలుడు కృష్ణ బాధిత కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్, నాయకురాలు సుగుణలతో పాటు నాయకులు బి. నర్సయ్య, వెంకట రమణ రెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు బాలుడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన

భైంసా, జూన్ 8: ప్రణాళికాబద్ధమైన విధానాలతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన అందించబడుతోందని భైంసా మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్ పెర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని పిప్రి కాలనీ ,ఏపీనగర్ కాలనీల్లో నిర్వహించి బడి బాట కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వడం జరుగుతోందన్నారు. పూర్తి స్థాయి అనుభవం గల ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు కాలనీల పరిధిలో ర్యాలీలు నిర్వహించి ఒకట తరగతిలో పలువురు విద్యార్థులను చేర్పించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్, ఐఈఆర్పీలు నరేష్, సునీల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



భైంసాలోని పిప్రి కాలనీలో నిర్వహిస్తున్న బడిబాట ర్యాలీ

ఆదిలాబాద్‌లో ఈదురు గాలులతో వర్షం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 8: ఆదిలాబాద్‌లో శనివారం సాయంత్రం ఒకేసారి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. తీవ్రమైన గాలి దుమారంతో పాటు భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చిన ప్రజలకు గాలి దుమారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో వైపు ఉదయం నుంచి ఎండ వేడిమితో ఇబ్బందులు పడ్డ పట్టణ ప్రజలకు వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. కాగా రెండు గంటల నుంచి కురుస్తున్న గాలులతో కూడిన వర్షానికి ఆదిలాబాద్‌లో పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. బ్రహ్మణవాడలోని శాస్త్రీ టెంపుల్ పైన



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

పక్కనున్న భారీ వృక్షం కుప్పకూలడంతో దాన్ని పక్కకు తీయడానికి కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడ్డారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తలమడుగు, జూన్ 8: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండ లంలోని దేవాపూర్ గ్రామంలో రైతుల విజ్ఞప్తి మేరకు పంట పొలాలకు రోడ్డు లేక ఇబ్బందులు పడు తున్నామని విజ్ఞప్తి చేశారు. వెంటనే సమస్యలను పరిష్క రించి ఎమ్మెల్సీ నిధుల నుంచి రోడ్డు పనులను జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథ కాలు ప్రవేశపెడు తుందన్నారు. ఆగస్టు 15 లోగా రైతుల కు రెండు లక్షల రుణ మాఫీ చేపడతామ న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతి, వెంకన్న యాదవ్, సుభాష్‌రెడ్డి, మహేం దర్, అశికలి, కాశీం, తదిత రులు పాల్గొన్నారు.

వెంకటాపూర్ ఆలయంలో నేడు ద్విదశాబ్ది వార్షికోత్సవ వేడుకలు

నిర్మల్ కల్చరల్, జూన్ 8: నిర్మల్ పట్టణం వెంకటాపూర్ గ్రామంలో కొలువైన మహా గణపతి, లక్ష్మీ నరసింహ, దత్తసాయి ఆలయ ద్విదశాబ్ది వేడుకలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త కొరిపెల్లి దేవేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం నుండి ప్రత్యేక పూజలు, నరసింహ స్వామి కళ్యాణం ఉంటాయని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కళ తప్పిన హరితహారం

● పట్టణంలో కనిపించని పచ్చదనం ● నీరుగారి పోతున్న ప్రభుత్వ లక్ష్యం


తెలంగాణచౌక్‌లో ఎండిపోయిన మొక్కలు



పలు కూడళ్లలో రోడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌లో ఎండిపోతున్న మొక్కలు


ఎన్టీఆర్‌చౌక్‌లో ఎండిపోయి కనిపిస్తున్న ఫౌంటేన్

ఆదిలాబాద్అర్బన్,జూన్8:పట్టణాలను పచ్చని తోరణాలుగా మార్చేందుకు హరిత హారంతోపాటు పట్టణప్రగతిలో మునిసిపాలిటీల్లో మొక్కలు పెంచేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుంది. స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంకు సాధించడం కోసం గ్రీన్ సిటీగా మార్చే లక్ష్యంగా అధికార యంత్రాంగం, పాలక వర్గాలు పని చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కాని క్షేత్ర స్థాయిలో దానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత యేడాది జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌చౌక్, కొమురంభీంచౌక్, శివాజిచౌక్, వినాయక్‌చౌక్, బాబుజగ్జీవన్‌రావ్‌చౌక్, కొండాబాపూజిచౌక్‌లను ఆధునికరించి కూడళ్ల చుట్టు పచ్చదనంను ఏర్పాటు చేశారు. కాని నీటి వసతిని కల్పించక పోవడంతో ఎండల తీవ్రతకు పూర్తిగా ఎండిపోయి కళ తప్పాయి. పచ్చదనం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రయోజనం కనిపించడం లే దంటున్నారు.అందులో భాగంగానే యేటా ప్రత్యేకంగా గ్రీన్ బడ్జెట్‌ను మంజూరు చేస్తుంది.అయితే ప్రభుత్వం ఆశిం చిన స్థాయిలో ఈ కార్యక్రమం అమలు కావడం లేదు. అధి కారులు మొక్కుబడిగా మొక్కలు నాటి సంరక్షణను విస్మరించడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుంది. యేటా మొక్కల కొనుగోలు, వాటి సంరక్షణకు ప్రభుత్వం సుమారు లక్షల రూపాయలు ఖర్చు చేస్తుంది. పురపాలక కొత్త చట్టం ప్రకారం మొక్కల సంరక్షణలో పాలక వర్గాల సభ్యులు,వార్డు కమిటీల సభ్యులు, ప్రజలను భాగస్వాములు చేయా లి. కాగా ఈ విధానం ఎక్కడ అమలు కావడం లేద న్న విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. కనీసం వార్డు కమిటీల సభ్యులకు సమాచారం కూడా ఇవ్వడం లేదని తెలుస్తుంది. అధికారులు, పాలక వర్గాల మధ్య సమన్వయ లోపం కార ణంగా లక్ష్యం నేరవే రడం లేదు. గతంలో ప్రధాన రహదా రుల వెంట నాటిన మొక్కల్లో 60 నుంచి 65శాతం మేర సంరక్షించారు. కాగా పట్టణ ప్రగతిలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు కొంత ఆశాజనకంగా ఉన్న, హరితహారం కింద నాటిన మొక్కలు 30శాతం కూడా క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. మొక్కలు నాటాక వాటిని సంరక్షించడాన్ని విస్మరిస్తు న్నారు. పర్యవేక్షణ లేక పోవడమే దీనంతటికి ప్రధాన కారణమన్న విమర్శలు వ స్తున్నాయి.



రాజీమార్గమే రాజమార్గం

భైంసా, జూన్ 8: రాజీ మార్గమే రాజమార్గమని, ఒక కేసులో రాజీ పడటం వల్ల ఇరు వర్గాలు ఆ కేసులో గెలిచినట్లేనని భైంసా జూనియర్ సివిల్ జడ్జీ దేవేందర్ బాబు అన్నారు. శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ ఆదాలత్ కార్యక్రమంలో మాట్లాడారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగకుండా రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులతో రాజీ కుదుర్చుకొని కేసుల నుంచి విముక్తి పొందాలని పెర్కొన్నారు. ఈ సందర్భంగా భైంసా కోర్టు పరిధిలో 1044 కేసులు లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించబడ్డాయి. బ్యాంక్‌లకు సంబంధించి 40 కేసులు పరిష్కరించబడగా రూ.47 లక్షల రికవరి చేయబడ్డాయి. ఇందులో ఏపీపీ ఆరుణ , భైంసా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.శంకర్‌లతో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు,బార్ అసోసియేషన్ సభ్యులు, ఫిర్యాదుదారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

'రామోజీరావు మృతి తీరని లోటు'

నిర్మల్‌కల్చరల్, జూన్8: ప్రముఖ దిన పత్రిక ఈనాడు గ్రూప్స్ చైర్మన్ సిహెచ్. రామో జీరావు మృతి పత్రికారంగానికి తీరని లోటని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామోజీ రావు మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రామోజీరావు తనదైన శైలిలో పత్రికారంగంలో చెరగని ముద్ర వేసుకున్నా రన్నారు. దేశ, విదేశాల్లో పత్రికారంగ ప్రతిష్టత చాటారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాం తి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. ము న్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఆత్రం సుగుణ, పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వాజిద్ అహ్మద్ ఖాన్, ఎంబడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్: ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి పట్ల నిర్మల్ ఎమ్మె ల్యే, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంతాపం ప్రకటించారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో స్వయం కృషితో ఎదిగిన గొప్ప దార్శనికుడు రామోజీ అని కొనియాడారు.ఆయన జీవితంఆదర్శప్రాయమని, స్ఫూర్తిదాయకమని అన్నారు.

● రామోజీరావు మృతి తీరని లోటు

ప్రముఖ దినపత్రిక ఈనాడు సంపాదకుడు రామోజీ రావు మృతి తీరని లోటని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో రామోజీ మృతి పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.రామోజీఆత్మకుశాంతి కలగాలని ప్రార్థించారు.



రామోజీకి సంతాపం తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు


భైంసాలో ..

● రామోజీరావు మృతి తీరని లోటు

ఆదిలాబాద్ అర్బన్: అక్షర యోధు డు రామోజీరావు మృతి చెందడం పత్రిక రంగానికి తీరని లోటని జర్నలిస్టు జేఏసీ కన్వీనర్ నూకల దేవేందర్ అన్నారు. జర్నలిస్టు జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంతాపసభను నిర్వహించారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ రామోజీరావ్ పత్రిక రంగంలో విలువలు,క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు.ఎల్లప్పుడు సమాజహితం కోసమే పరితపించి, అనేక మంది జర్నలిస్టులను తయారు చేశారని తెలిపారు. ఆయన మృతి చెందడం బాధకరమన్నారు.

భైంసా రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు టీయూడబ్ల్యూజే భైంసా డివిజన్ ఘన నివాళులర్పించింది. శనివారం భైంసాలోని విశ్రాంతి భవనం వద్ద యూనియన్ ప్రతినిధులు రామోజీరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమ ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ రామోజీరావు మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటన్నారు. పత్రిక రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.



పాత బంధం కలిసింది

బోథ్, జూన్ 8: ఆదిలాబాద్ జిల్లా ఎంపీ జి.నగేష్ గత మూడు రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లారు. ఢిల్లీలో ఉన్న ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నట్లు తెలుసుకుని జిల్లా ఎంపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా గతంలో చంద్రబాబునాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో జరిగిన అభివృద్ధిని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకు న్నారు. ఇద్దరూ గత ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయు డు, రాష్ట్ర మంత్రిగా, బోథ్ ఎమ్మెల్యేగా గతంలో గెలుపొంది చంద్ర బాబు నాయుడు హయాంలో జేసీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిం చారు. వీరి కలయిక సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసు కున్నారు.


చంద్రబాబుతో ఆదిలాబాద్ జిల్లా ఎంపీ నగేష్ (ఫైల్)

'రాష్ట్ర అధ్యక్షు పదవులను బీసీలకు కేటాయించాలి'

నిర్మల్ కల్చరల్, జూన్ 8 : తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవులు బీసీలకు కేటాయించాలని జాతీయ బీసీ సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్ తదితర నాయకులు శనివారం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. జనాభాలో 52 శాతం గల బీసీలకు పదవులు కేటాయించి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు.తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. నాయకులు అనుముల భాస్కర్, పురాస్తు శంకర్, తిరుపతి, రమేష్, మొహమ్మద్ ఫిర్దోస్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణ స్థల పరిశీలన


కోర్టు భవన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికారి

బోథ్, జూన్ 8 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న కోర్టు భవన నిర్మాణ స్థలాన్ని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన త్వరలోనే భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఆయన వెంట స్థానిక న్యాయాధికారి హుస్సేన్, బార్ అసోసి యేషన్ అధ్యక్ష కార్యదర్శులు వామన్‌రావు దేశ్‌పాండేతో పాటు న్యాయవాదులు మోహన్‌రావు, పంద్రం శంకర్, ఆడేపు హరీష్, కుమ్మరి విజయ్, జమీర్, దమ్మపాల్‌తోపాటు కోర్టు సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి, స్థానిక ఎస్సై బి.రాము పాల్గొన్నారు.

● లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం

బోథ్: లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం జరుగు తుందని కక్షిదారులు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని మెజిస్ట్రేట్ బి.హుస్సేన్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న తప్పులు చేసి కేసుల్లో ఇరుక్కొని విలువైన సమయాన్ని వృధా చేసుకో వద్దని కోరారు. లోక్ అదాలత్‌లో బ్యాంకు అదాలత్ ద్వారా 36 కేసు లను పరిష్కరించడం జరిగింది.అంతేగాక 18 ఎస్‌టీసీ, 103 ఎక్సైజ్, సివిల్ కేసులు 51 రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్ రావు దేశ్‌పాండే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీధర్, న్యాయవాదులు సుభాష్, మోహన్‌రావు, పంద్రం శంకర్, ఆడేపు హరీష్, కుమ్మరి విజయ్ కుమార్, జమీర్, ధర్మపాల్‌లతో పాటు బోథ్ ఎస్సై బి.రాము, బజార్ హత్నూర్ ఎస్సై నరేష్, కోర్టు కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

జిల్లా అధికారి రిటైర్మెంట్ ఫంక్షన్‌లో రచ్చరచ్చ

● వాటా ఇవ్వలేదంటూ ఓ కాంట్రాక్టర్‌కు బెదిరింపులు ● హాజరైన నేతలు

ఆదిలాబాద్,జూన్8 (ఆంధ్రజ్యోతి)జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి అధికారి రిటైర్మెంట్ ఫంక్షన్‌లో అధికారుల మధ్య రచ్చ జరిగినట్లు తెలుస్తుంది. అర్ధరాత్రి వరకు తాగి ఊగిన కొందరు నేతలు, అధికారులు మద్యం మత్తులో ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం వివాదానికి దారి తీసింది. ఫంక్షన్‌హాల్ ముందే రోడ్డు పై ఘర్షణకు దిగినట్లు సమాచారం. అలాగే జిల్లాలోని ఒక్కో కాంట్రాక్టర్ రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఫంక్షన్ ఖర్చుల కోసం వాటాలుగా చెల్లించినట్లు తెలిసింది. గత నెలలోనే అదే శాఖకు చెందిన ఓఅధికారి రిటైర్మెంట్ ఫంక్షన్‌కు కూడా కాంట్రాక్టర్లందరు కలిసి కొంత డబ్బును జమ చేసి చెల్లించినట్లు చెబుతున్నారు. అయితే ఈ సారి అంత సొమ్మును ఇవ్వలేమని కాంట్రాక్టర్ తేల్చిచెప్పడంతో ఓఅధికారి బెదిరింపులకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. ఈ రిటైర్మెంట్ ఫంక్షన్‌కు జిల్లాలోని అన్ని నియోజక వర్గాల నుంచి అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యనేతలందరు హాజరు కావడం విశేషం. ప్రజా ప్రతినిధుల ముందే కొంత మంది అధికారులు వాగ్వాదానికి దిగడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.


అక్రమంగా గుట్కా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి, జూన్ 8: ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు అక్రమంగా నిషేధిత గుట్కా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ శనివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఉట్నూర్ మండలంలోని శ్యామ్‌పూర్ గ్రామానికి చెందిన అతిక్ దావూద్ దుంగే ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు ద్విచక్ర వాహనంపై గుట్కా తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు అంజి చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడ్డ నిషేధిత గుట్కా విలువ సుమారు రూ.32వేలు ఉంటుందని తెలిపారు. పట్టుబడ్డ గుట్కాను స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత గుట్కా అమ్మిన అక్రమంగా తరలించి పట్టుబడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్ళు ఉన్నారు.


ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

ముథోల్, జూన్ 8: మండల కేంద్రమైన ముథోల్ సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.ముథోల్ వైపు నుంచి రెండు ద్విచక్ర వాహనాలు బాసరకు వెళ్తుండగా ఢీకొన్నాయి.దీంతో బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ తపాలా ఉద్యోగి కామన్న పటేల్(68) అక్కడికక్కడే మృతి చెందాడు.భైంసాకు చెందిన రాహుల్, నారాయణలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో భైంసాకు తరలించారు.ఈ రోడ్డు ప్రమాదానికి అతివేగం, అజాగ్రత్త కారణమని ఎస్సై తెలిపారు.ఈమేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.









ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5, కనిష్ఠం 28.2
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 9 జూన్ 2024





● బ్రిడ్జి కుంగిపోవడంతో రాకపోకలు నిలిపి వేసినట్లు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు



● తర్నం బ్రిడ్జి వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్డు



వెంటాడుతున్న.. దారి కష్టాలు!



- జిల్లాలో అడుగు ముందుకు పడని తర్నం బ్రిడ్జి నిర్మాణ పనులు
- వర్షాకాలం ముంచుకొస్తున్నా.. పత్తాలేని కాంట్రాక్టర్
- చిన్నపాటి వరదలకే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం
- స్థానిక గ్రామాల ప్రజల ఆందోళనలతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- అయినా ఇప్పటికీ అసంపూర్తిగానే పనులు
- జైనథ్-బేల మండలాల ప్రజల రాకపోకలకు తప్పని తిప్పలు
- అయినా పట్టించుకోని పాలకులు, హైవే అథారిటీ అధికారులు
- మరోవైపు ఆదిలాబాద్-బేల-రాజురా రహదారి విస్తరణ కోసం కొనసాగుతున్న సర్వే పనులు

ఆదిలాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంతర్ రాష్ట్ర రహదారిపై జైనథ్ మండలం తర్నం వద్ద సాత్నాల వాగుపై నిర్మించిన బ్రిడ్జి గతేడు భారీ వరదలకు కుంగిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక గ్రామాల ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలకు దిగారు. దీంతో గత ప్రభుత్వం హుటాహుటిన ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగానే జైనథ్ మండలం నిరాల నుంచి లాండసాంగి మీదుగా సీసీఐ పరిశ్రమ సమీపం నుంచి జిల్లాకేంద్రానికి చేరుకునే విధంగా రోడ్డు మార్గాన్ని నిర్మించేందుకు నిధులను మంజూరు చేసింది. దాదాపుగా 15కి.మీ.ల రోడ్డు విస్తరణ పనులకు గాను రూ.32 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అయినా ఇప్పటి వరకు రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. అలాగే నేషనల్ హైవే అథారిటీ ఆదిలాబాద్- బేల-రాజురా రహదారిని 353(బి) జాతీయ రహదారిగా గుర్తిస్తూ 33 కి.మీ.ల మేర రోడ్డు విస్తరణ పనులకు రూ.490 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ పనులను మార్చి మాసంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటన సందర్భంగా ప్రారంభించారు. అయినా ఇప్పటి వరకు అడుగుముందుకు పడినట్లు కనిపించడం లేదు. టెండర్ పూర్తయి ఆరు మాసాలు గడిచి పోతున్నా.. ఇంకా పనులు అగ్రిమెంట్ దశలోనే కనిపిస్తున్నాయి. బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డు విస్తరణ పనులను మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాకు చెందిన ఆర్‌బీ షెహెట్కి కంపెనీ దక్కించుకుంది. రోడ్డు నిర్మాణ సంస్థ సర్వే పనుల పేరిట తీవ్ర కాలయాపన చేస్తూ వస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ యేడు కూడా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవంటున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్ నిండు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. నేషనల్ హైవే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారిందంటున్నారు.

46 శాతం లెస్‌తో పనులు ఎలా సాధ్యం?

నేషనల్ హైవే 353(బి) రహదారి విస్తరణ పనులను కాంట్రాక్ట్ కంపెనీ 46 శాతం లెస్‌తో దక్కించుకుంది. ఈ నిధులతో ఆదిలాబాద్-బేల-రాజురా వరకు రోడ్డు విస్తరణతో పాటు బ్రిడ్జి నిర్మాణం పనులను చేపట్టాల్సి ఉంటుంది. అయితే భారీ మొత్తంలో లెస్‌కు పనులు దక్కించుకోవడం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. పనులపై అధికార వర్గాల్లోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ.490 కోట్ల నిధులకు గాను రూ.360 కోట్లకే టెండర్‌లను పూర్తి చేశారు. వివిధ దశల్లో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇందులో రూ.194 కోట్లతో 33కి.మీ.ల రహదారి విస్తరణ, తర్నం బ్రిడ్జి పనులను పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈ నిధులతో పనులు చేయడం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులకు అవసరమైన కంకర, మొరం, ఇతర వసతులు కూడా స్థానికం గా అందుబాటులో లేవు. ఇలాంటి కారణాలతోనే పనులు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్ వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తుంది. టెండర్ ప్రక్రియ పూర్తయి ఆరు మాసాలు గడిచిపోతున్నా.. రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు రోడ్డుకు ఇరువైపుల జంగల్ కటింగ్ పనులను కూడా చేపట్టడం లేదు. పనులు పూర్తి కావాలంటే మరో రెండేళ్ల పాటు సమయం పట్టే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వర్షాలు కురిస్తే అంతే సంగతి!!

వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇక రాకపోకలకు ఇబ్బందులు తప్పవంటున్నారు. చిన్నపాటి వరదలకే తర్నం బ్రిడ్జి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ రెండుసార్లు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడం పలు వాహనాలు ప్రమాదాలకు గురికావడం తో పాటు ఒకరిద్దరు కూడా మృతి చెందారు. తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతే నిరాల నుంచి అడ, లాండసాంగి మీదుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. నిత్యం ఈ రహదారి మీదుగా వందలాది వాహనాలు మహారాష్ట్ర నుంచి వస్తూ పోతుంటాయి. చంద్రాపూర్, బలార్షా ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు పలు రకాల వ్యాపారాలు సాగుతాయి. ముఖ్యంగా సిమెంట్ ఈ దారి గుండానే జిల్లాకు చేరుతుంది. భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు తప్పవంటున్నారు. తర్నం బ్రిడ్జి కుంగిపోయి యేడాది గడుస్తున్నా.. అధికారులు మాత్రం నిండు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. సాత్నాల వాగుకు వరదలు వస్తే ఒకటి రెండు వర్షాలకే తాత్కాలిక బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర సమయంలోనూ రాకపోకలకు ఇబ్బందులు తప్పవంటున్నారు. గతంలో ఓ అంబులెన్స్ తాత్కాలిక రోడ్డుపై ఇరుకుపోయిన దాఖలాలు ఉన్నాయి. ఇకనైనా పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక మండలాల ప్రజలు కోరుతున్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులే..

తర్నం బ్రిడ్జి కుంగిపోవడంతో జైనథ్, బేల రెండు మండలాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిరాల నుంచి లాండసాంగి మీదుగా రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ఈయేడు కూడా ఇబ్బందులు తప్పవంటున్నారు. గ్రామాల మీదుగా భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. దూరభారంతో పాటు ప్రయాణం ప్రమాదకరంగా మారిందని చెబుతున్నారు. భారీ వాహనాలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయి గుంతలమయంగా మారే అవకాశం ఉందంటున్నారు. నిరాల నుంచి ఆదిలాబాద్ జిల్లాకేంద్రం వరకు ఉన్న గ్రామాల్లో ఇరుకు రోడ్లతో ఇబ్బందులు తప్పవంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనూ జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే అవస్థలు పడాల్సి ఉంటుందని చెబుతున్నారు. అడుగడుగునా.. ఉన్న మలుపులతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదంటున్నారు. యేడాది కాలంగా తర్నం బ్రిడ్జిని పునరుద్ధరించి ఉంటే ఇలాంటి ఇబ్బందులు తప్పేవన్న వాదనలు వినిపిస్తున్నాయి. బ్రిడ్జి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'ఆదిలాబాద్-బేల-రాజురా' సర్వే పనులు కొనసాగుతున్నాయి
: సుభాష్, నేషనల్ హైవే డీఈ

ఆదిలాబాద్-బేల-రాజురా వరకు చేపట్టే రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. త్వరలోనే పనులను ప్రారంభించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. వచ్చే వర్షాకాలం వరకు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. 46 శాతం లెస్‌తో టెండర్ దక్కించుకున్నా.. పనులను నాణ్యతగానే చేపడతాం. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో పనులను ప్రారంభిస్తాం.

సంక్షిప్త సమాచారం



కేంద్రంలో తనిఖీ చేస్తున్న రీజినల్ కో ఆర్డినేటర్

గ్రూప్-1 పరీక్షకు సర్వం సిద్ధం

● పరీక్షల రీజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్
● జిల్లాకేంద్రంలో కేంద్రాల సందర్శన

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 8: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పూర్తి ఏర్పాట్లు చేశామని పరీక్షల రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పట్టణంలో జరిగే పరీక్షకు సంబంధించిన కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఇక్కడ కల్పించిన సౌకర్యాలను తెలుసుకుంటు పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎలాటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆదివారం జరిగే పరీక్షకు మొత్తం 6వేల 729 మంది హాజరుకానుండగా.. వారి కోసం 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో పాటు ఎండల తీవ్రత నేపథ్యంలో వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగనుంది. ఈ సందర్భంగా పరీక్షల ఆర్వో శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షకు వచ్చే అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉన్నందున కేంద్రాలకు త్వరగా చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, పెన్నులు తప్ప వేరే వాటిని లోనికి అనుమతి ఉండదన్నారు. 8గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు ఉంటుందని, 10 గంటల నుంచి హాజరు తీసుకోవడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

రేపు ఉపాధ్యాయులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్

ఆదిలాబాద్ రూరల్, జూన్ 8: జిల్లాలోని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలలో పని చేస్తున్న తెలుగు, హిందీ, మరాఠి, ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయుల సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఈనెల 10న జరుపుతున్నట్లు డీఈవో ప్రణీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ఉదయం 10.30నుంచి సాయంత్రం 5 గంటల లోపు హాజరు కావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వెరిఫికేషన్‌కు అన్ని రకాల విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు సర్వీస్ రిజిస్టర్, ఒక జత జిరాక్స్ కాపీలను తీసుకురావాలని పేర్కొన్నారు.

మీసేవ సెంటర్ తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, జూన్ 8: జిల్లాకేంద్రంలోని తాంసి బస్టాండ్ సమీపంలో గల మీ సేవ సెంటర్‌ను శనివారం కలెక్టరేట్ ఈడీఎం బండి రవి పరిశీలించారు. మీ సేవ వీఎల్ఈలకి మంజూరు చేసిన స్థలంలోనే మీ సేవ నడిపియాలని, అదేవిధంగా స్టేషనరీ రిజిస్టర్ కచ్చితంగా అప్‌డేట్ ఉంచాలని సూచించారు. మీ సేవ ఆపరేటర్ ఇచ్చే రిసిప్ట్ పైన టీ ఎస్‌జీఎస్‌కి బదులుగా టీజీటీఎస్ స్టాంపు చేసుకొని రిసిప్ట్ పైన చూసుకొని స్టాంపు వేసి సిటిజెన్స్‌కి అందజేయాలని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం



పాల్గొన్న పోలీసు అధికారులు


గ్రూప్-1 పరీక్షకు గట్టి బందోబస్తు

● జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ● ప్రతీ సెంటర్ వద్ద సీఐ, ఎస్సై స్థాయి అధికారితో పర్యవేక్షణ ● పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు


ఆదిలాబాద్ అర్బన్, జూన్ 8: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి భద్రతతో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు.స్థానిక ఎస్పీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద విధులను నిర్వహించనున్న సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 18 కేంద్రాల వద్ద 6,729 మంది అభ్యర్థులు పరీక్షను రాయనున్నారని, పరీక్ష కేంద్రాల వద్ద సీఐ, ఎస్సై స్థాయి అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించి, ప్రతీ కేంద్రం వద్ద పది మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందని తెలిపారు. పట్టణంలో నాలుగు రూట్లలో ప్రత్యేక అధికారులను నియమించి నిరంతరం పర్య వేక్షించే విధంగా బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాన్ని లోపలికి వెళ్లే సమయంలో అభ్యర్థులు ప్రతిఒక్కరిని పరిశీలిస్తూ, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, ఎలక్ట్రానిక్ పరికరాలను, వాచ్‌లను పరీక్ష కేంద్రంలోనికి పంపకూడదని తెలిపారు. సిబ్బంది ఉదయాన్నే పరీక్ష కేంద్రాలను క్షుణంగా తనిఖీ చేసి పరిశీలించాలని, 10గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష కేంద్రంలోకి అనుమతించకూడదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ర్యాలీలు, సభలు నిర్వహించవద్దని, గుంపులుగా తిరగకుండా పట్టణంలోని సీఐలు పరీక్ష పూర్తయ్యేంత వరకు గస్తీ నిర్వహిస్తూ పర్యవేక్షిస్తుండాలని సూచించారు. అలగే పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల జిరాక్స్ షాపులను మూసి వేయించాలన్నారు. 18 పరీక్ష కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులతో నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందని తెలపారు. ఇందులో అదనపు ఎస్పీ పరిపాలన బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పట్టణ సీఐలు, ఎస్సైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● పారదర్శకంగా హోంగార్డుల బదిలీ ప్రక్రియ

ఆదిలాబాద్ అర్బన్: జిల్లాలో హోంగార్డు బదిలీ ప్రక్రియను స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ గౌస్‌ఆలం అధ్యక్షతన పారదర్శకంగా పూర్తి చేశారు. జిల్లాలో ప్రతీ సంవత్సరం హోంగార్డుల బదిలీ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా నిర్మల్ జిల్లా నుంచి 62 మంది హోంగార్డులు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 35 మంది హోంగార్డులు ఆదిలాబాద్ జిల్లాకు రానున్నారని తెలిపారు. వారి స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి మొత్తం 97 మంది హోంగార్డులను లక్కీ లాటరీ విధానం ద్వారా బదిలీ ప్రక్రియను నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. సాధారణ విధులు నిర్వహించే హోంగార్డులు, వాహన డ్రైవర్స్, దోబీలు, వంట పని చేసే వారు, వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న 97 మందిని నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఇద్దరిని ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. బదిలీ ప్రక్రియను హోంగార్డుల మధ్య పారదర్శకంగా ఎటువంటి అపోహలు లేకుండా నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నవీన్, టి.మురళి, చంద్రశేఖర్, పోలీసు కార్యాలయం సిబ్బంది సూపరింటెండెంట్ సంజీవ్, సిబ్బంది, హోంగార్డు యూనిట్ అధికారులు రమేష్, రిజర్వు సబ్ ఇన్స్‌పెక్టర్లు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు



ఎస్పీతో కలిసి రాజీ పత్రాలను అందజేస్తూ..

సమస్యల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్

● జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 8: సమస్యల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లను కక్షిదారులు వినియోగించుకుంటున్నారని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో పలువురు కక్షిదారులు రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోగా వారికి రాజీ పత్రాలను న్యాయమూర్తులు, ఎస్పీ గౌస్‌ఆలంతో కలిసి జిల్లా న్యాయాధికారి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే ఇద్దరు కక్షిదారుల గెలుపవుతుందన్నారు. కేసుల సంఖ్యలను తగ్గించేందుకు గాను ప్రతీ మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని, కక్షిదారులు కూడా పెద్దసంఖ్యలో వారి కేసులను పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా సైబర్ క్రైమ్ కేసుల పట్ల పోలీసులు, న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారని ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. కక్షిదారులు కోర్టుల చుట్టు తిరగకుండా త్వరగా రాజీద్వారా పరిష్కరించేలా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, న్యాయాధికారులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

● లోక్‌అదాలత్‌లో 271 కేసుల పరిష్కారం

ఉట్నూర్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 271 కేసులు పరిష్కరించామని ఉట్నూర్ మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ అన్నారు.శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో రాజీ కేసులు పరిష్కరించామన్నారు.బ్యాంకుకేసులు 190 పరిష్కరించగా రూ.2.66 కోట్లకు పరిష్కారం లభించిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్‌టీసీ మొత్తం 42 కేసులు, పరస్పర అంగీకారం కేసులు 22, సీసీ అడ్మిషన్ కేసులు 17 పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు అధికారులతో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.